

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 15-06-2025 సంపుటి : 07 సంచిక : 32 పేజీలు : 8 వెల : రూ 3-00

## ఏపీ సీఎం చంద్రబాబుతో తెలుగు సినీ పరిశ్రమ ప్రముఖుల కీలక భేటీ



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో తెలుగు సినీ పరిశ్రమ ప్రముఖులు ) రేపు(ఆదివారం) సాయంత్రం 4 గంటలకు కలవనున్నారు. ఈ సమావేశంలో తెలుగు చిత్ర పరిశ్రమకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించనున్నారు. మొదట ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ని కలిసి మాట్లాడుతారు. ఆ తర్వాత పవన్‌తో పాటు చంద్రబాబు నివాసానికి సినీ పెద్దలు వెళ్లనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కసారైనా సీఎం చంద్రబాబుని కలిశారా అని సినీ ప్రముఖులను ఇటీవల పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. థియేటర్‌ల బంద్ అంశానికి సంబంధించి పవన్‌కల్యాణ్ సీరియస్ అయ్యారు.ఏపీలో థియేటర్‌ల పరిస్థితి.. సదుపాయాలకు సంబంధించి డీటెయిల్ రిపోర్ట్ ఇవ్వాలని సినిమాటోగ్రఫీశాఖ ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు రంగంలోకి దిగి పలు థియేటర్‌లలో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లను సినీ ప్రముఖులు కలవనున్నారు. రాష్ట్ర విభజన జరిగి 11 ఏళ్లయినా ఏపీలో అంతంత మాత్రంగానే సినీ ఇండస్ట్రీ ప్రభావం ఉంటుంది. కనీసం సింగిల్ షెడ్యూల్ సినిమా కూడా ఏపీలో తీయలేని పరిస్థితి ఉండటంతో ఈ భేటీకి ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రభుత్వం ఏం చెబుతుంది, సినీ ప్రముఖులు ఏమి కోరతారనే అంశంపై ఈ సమావేశంలో చర్చలు జరుగనున్నాయి. చంద్రబాబు సూచన మేరకు సినీ ప్రముఖులకు మంత్రి కందుల దుర్గేష్ ఫోన్ చేసి ఆహ్వానం పలికారు. ఈ భేటీకి మొత్తం 35 నుంచి 40 మంది సినీ ప్రముఖులు హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ సమావేశం అనంతరం ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లతో మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేకంగా భేటీ కానున్నారు.ఈ సమావేశానికి హాజరయ్యే దర్శకులు, నిర్మాతలు, నటులు వీరే..బోయపాటి శ్రీనివాస్,త్రివిక్రమ్ శ్రీనివాస్,రాజమౌళి,నాగ అశ్విన్ ,నిర్మాతలు ,అశ్వినీదత్, దిల్‌రాజు, అల్లు అరవింద్ ,దానయ్య, కేవీ రామారావు, నటీ నటులు ,నందమూరి బాలకృష్ణ, దగ్గుబాటి వెంకటేశ్, మంచు మనోజ్, సుమన్, ఆర్.నారాయణమూర్తి, నాని

## ఆ బాధ నాకు తెలుసు..నా తండ్రి కూడా: కేంద్రమంత్రి రామ్మోహన్

న్యూఢిల్లీ, జూన్ 14: అహ్మదాబాద్‌లో ఈనెల 12న జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాద ఘటన తీవ్రగ్భ్రాంతికి గురిచేసింది. ఈ దుర్ఘటనలో విమానంలో ఉన్న 242 మందిలో 241 మంది ప్రాణాలు కోల్పోగా.. ఒక్కరు మాత్రం మృత్యుంజయుడిగా నిలిచాడు. ఇక విమానం మెడికల్ కాలేజ్ హాస్టల్‌లోకి దూసుకెళ్లడంతో 33 మంది మెడికోలు కూడా ప్రాణాలు కోల్పోయారు. తాజాగా ఈ విమాన ప్రమాదంపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. విమాన ప్రమాదంలో చనిపోయిన కుటుంబాలకు సంతాపం వ్యక్తం చేశారు. గడిచిన రెండు రోజులు భారంగా గడిచిందని.. ప్రమాదంలో ఎవరైనా చనిపోతే ఆ కుటుంబం అనుభవించే



బాధ తనకు ప్రత్యేకంగా తెలుసన్నారు.'నాకు బాధితుల బాధ తెలుసు. నా తండ్రి గతంలో రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. విమాన ప్రమాదం జరిగిన వెంటనే నేను సంఘటనా స్థలానికి చేరుకుని చర్యలు చేపట్టాం. ప్రమాదం స్థలాన్ని పరిశీలించాను. గుజరాత్ ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టింది. వీలైనంత సహాయక చర్యలు గుజరాత్ ప్రభుత్వం వెంటనే చేపట్టింది' అని తెలిపారు. పౌర విమానయాన శాఖ ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుందన్నారు. ఈ ఘటనపై ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మెడికల్, ఫోరెన్సిక్, టీమ్‌లతో పాటు ఐదుగురితో ఏఐబీ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. బ్లాక్ బాక్స్‌ను ఇప్పటికే స్వాధీనం చేసుకున్నామని... అందులో ఉన్న సమాచారం కీలకంగా మారనుందని తెలిపారు. బ్లాక్ బాక్స్‌లో ఉన్న సమాచారం రానున్న రోజుల్లో కీలకమని చెప్పుకొచ్చారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శి చైర్మన్ నేతృత్వంలో కమిటీ వేసినట్లు తెలిపారు. హోంశాఖ కార్యదర్శి, సివిల్ ఏవియేషన్ సెక్రటరీ, గుజరాత్ అధికారులు, పోలీసు కమిషనర్ అహ్మదాబాద్, స్పెషల్ డైరెక్టర్ ఐబీని ఈ కమిటీలో నియమించినట్లు చెప్పారు.ఈ కమిటీ మూడు నెలల్లో విచారణ పూర్తి చేసి నివేదిక ఇస్తుందన్నారు. భద్రతా ప్రమాణాలు పెంచేలా చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రమాదం తెలిసిన వెంటనే బోయింగ్ 787 సిరీస్‌కు చెందిన విమానాలను పరిశీలించాల్సిందిగా డీజీసీఏకు ఉత్తర్వులు ఇచ్చామన్నారు. బోయింగ్ విమానాలు దేశంలో 34 ఉన్నాయని.. ఇప్పటికే 8 విమానాలను ఇన్స్పెక్షన్ చేసినట్లు చెప్పారు. డీఎన్ఏ టెస్టులు కూడా జరుగుతున్నాయన్నారు. 24 గంటల్లోనే ప్రధాని మోదీ (ఖఓ ఓనీటతి) ప్రమాద స్థలాన్ని పరిశీలించారన్నారు. హై లెవెల్ కమిటీతో సోమవారం (జూన్ 16) భేటీ అవనున్నట్లు తెలిపారు. గడిచిన 48 గంటల నుంచి ప్రజలకు అన్ని విషయాలు తెలియజేస్తున్నామని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు

## సైప్రస్, కెనడా, క్రొయేషియాలో మోదీ పర్యటన

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ) ఆదివారం నాడు మూడు దేశాల పర్యటనకు వెళ్లనున్నారు. ఈనెల 15, 16 తేదీల్లో సైప్రస్ లో ఆయన పర్యటిస్తారు. 16, 17 తేదీల్లో కెనడా(అజీనిజీటజీ)లో నిర్వహించే జీ-7 సదస్సులో పాల్గొంటారు. అనంతరం 18న క్రొయేషియా )లో పర్యటిస్తారు. ఈ మేరకు కేంద్ర విదేశాంగ శాఖ శనివారం నాడు వివరాలు వెల్లడించింది.ఎంఈఏ వివరాల ప్రకారం, సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ ఆహ్వానం మేరకు ప్రధానమంత్రి మోదీ ఈనెల 15-16 తేదీల్లో ఆ దేశంలో అధికారిక పర్యటన జరుపుతారు. రెండు



దశాబ్దాలుగా ఆ దేశంలో భారత ప్రధాని పర్యటించడం ఇదే ప్రథమం. అధ్యక్షుడు క్రిస్టోడౌలిడెస్‌తో చర్చల అనంతరం లిమాసోల్‌లో వ్యాపార దిగ్గజాలను ఉద్దేశించి మోదీ ప్రసంగిస్తారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల పటిష్టతకు ప్రధాని పర్యటన దోహదం కానుంది. ఆ తర్వాత కెనడాకు ప్రధాని మోదీ బయలుదేరుతారు. కెనడా ప్రధాని మార్క్ కార్నే ఆహ్వానం మేరకు జూన్ 16-17 తేదీల్లో జరిగే జీ-7 సదస్సులో ఆయన పాల్గొంటారు. జీ-7 సదస్సులో మోదీ పాల్గొనడం వరుసగా ఇది ఆరోసారి. సదస్సు సందర్భంగా పలు ద్వైపాక్షిక సమావేశాల్లోనూ ప్రధాని మోదీ పాల్గొంటారు.ప్రధాని తన పర్యటన చివర్లో క్రొయేషియాలో పర్యటిస్తారు. క్రొయేషియా ప్రధాని ఆండ్రెజ్ ప్లెంకోవిక్ ఆహ్వానం మేరకు జూన్ 18న ఆ దేశంలో అధికారిక పర్యటన జరుపుతారు. క్రొయేషియాలో భారతదేశ ప్రధానమంత్రి ఒకరు పర్యటించనుండటం ఇదే మొదటిసారి. ద్వైపాక్షిక సంబంధాల్లో ప్రధాని పర్యటన మైలురాయి కానుంది. ప్రధాని ప్లెంకోవిక్, అధ్యక్షుడు జోరన్ మిలనోవిక్‌తో మోదీ సమావేశమవుతారు. యూరోపియన్ యూనియన్ భాగస్వాములతో మరింత పటిష్ట బంధాల గురించి చర్చిస్తారు.

## జగన్ ప్రభుత్వ హయాంలో పెట్టుబడి దారులు పారిపోయారు




అమరావతి: గత జగన్ ప్రభుత్వ హయాంలో పెట్టుబడి దారులు ఏపీ నుంచి పారిపోయారని మంత్రి కొలుసు పార్థసారథి ( విమర్శించారు. విద్యావిధానం పటిష్ట పరిచేందుకు విద్యార్థులకు స్కిల్ డెవలప్ చేస్తున్నామని అన్నారు. స్త్రీ శక్తి ద్వారా మహిళల సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని అన్నారు. మహిళలను అవమానపరిచేలా వైసీపీ నేతలు వ్యవహారిస్తున్నారని ధ్వజమెత్తారు. దేశ అత్యున్నత న్యాయస్థానంలో చాలామంది వైసీపీ నేతలకు బెయిల్ దొరకటం లేదని చెప్పారు. ఇవాళ(శనివారం) అమరావతిలో మంత్రి కొలుసు పార్థసారథి మీడియాతో మాట్లాడారు. కేవలం ఓ వ్యక్తికి బెయిల్ దొరికితేనే అంతా బాగున్నట్లుగా వైసీపీ నేతలు ప్రవర్తించటం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. కూటమి సర్కార్ ఏడాది పాలనలో తమకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలను ఏడాది పాలనలో అమలు చేశామని ఉద్ఘాటించారు మంత్రి కొలుసు పార్థసారథి.తల్లికి వందనం పథకాన్ని ప్రపంచంలో ఇంత పెద్ద ఎత్తున ఎవరూ అమలు చేయలేదని మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు. తల్లికి వందనంలో భాగంగా ఎంతమంది పిల్లలు ఉన్నా పథకం అమలు చేశామని తెలిపారు. వైసీపీ అమ్మబడికి రూ.15 వేలు ఇస్తామని చెప్పిందని.. పిల్లలందరికీ ఇస్తామని చెప్పి ఒక్కరికే ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రతిపక్షం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. తల్లికి వందనంలో రూ. 2 వేలు మంత్రి నారా లోకేష్ జేబులో వేసుకుంటున్నారని వైసీపీ నేతలు అన్నారని.. ఈ విషయంలో లోకేష్ సవాల్‌కి సిద్ధమా అంటే వారు పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. రూ. 34 వేల కోట్లు ఏడాదిలో పెన్షన్ కిందా ఇచ్చామని చెప్పారు. వైసీపీ హయాంలో ఏ పథకాలు ఇచ్చారో తెలుసుకోవాలని అన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి రూ. 1.04లు ఇచ్చామని గుర్తుచేశారు. జగన్ హయాంలో కేవలం రూ.64 వేలు మాత్రమే ఇచ్చారని.. పిల్లల భవిష్యత్ గురించి ఆలోచించారా అని మంత్రి పార్థసారథి ప్రశ్నించారు.


## డ్రీమ్‌లైనర్ విమానాల్లో భద్రతా తనిఖీలు: ఎయిరిండియా

న్యూఢిల్లీ: అహ్మదాబాద్‌లో ఘోర విమాన ప్రమాదం అనంతరం బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానాల్లో భద్రతా తనిఖీలు చేపట్టినట్టు ఎయిరిండియా (ంతితీ ఎనిటతిజీ) తెలిపింది. డ్రీమ్‌లైనర్ విమానాల్లో విస్తృత భద్రతా తనిఖీలు చేపట్టాలని పౌర విమానయాన భద్రతా తనిఖీల కింద తొమ్మిది బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్లలో భద్రతా తనిఖీలు పూర్తి చేసినట్టు పేర్కొంది.

## యోగా ద్వారా మానసిక ఒత్తిడిని దూరం చేసుకోండి

### జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 14-ప్రతి రోజు యోగాసనాలు ఆచరించి మానసిక ఒత్తిడికి దూరం కావాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. ఈనెల 21వ తేది అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం నంద్యాల పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో మాస్ డెమో యోగా కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, డిఎంహెచ్ఓ డా. వెంకటరమణ, ఆయుష్ శాఖ సీనియర్ మెడికల్ అధికారి డా. యశోధర వివిధ యోగ అసోసియేషన్ సభ్యులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ప్రతిరోజు యోగాను ఆచరించి శారీరికంగా, మానసికంగా, ఉల్లాసంగా, జీవితంలో ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి గారి సూచనల మేరకు జిల్లా, మున్సిపల్, మండల, గ్రామ స్థాయిలో నెల రోజుల పాటు యోగాంధ్ర-2025 కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. జూన్ 21వ తేది అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా ప్రధానమంత్రి విశాఖపట్నంలో పాల్గొంటున్నారని... అదే సమయంలో జిల్లా అంతటా గుర్తించిన ప్రదేశాలలో యోగా కార్యక్రమాల నిర్వహణకు మాస్ డెమో కార్యక్రమాన్ని చేపట్టామని కలెక్టర్ తెలిపారు. ఇందుకు సంబంధించి యోగ గురువుల ద్వారా అన్ని మండల కేంద్రాలలో శిక్షణా కార్యక్రమాలు పూర్తి చేశామని కలెక్టర్ తెలిపారు.జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ మాట్లాడుతూ యోగాను ప్రతి ఒక్కరు ఆచరించి జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలన్నారు. అనంతరం ఆనంద్ గురూజీ బృందం కార్యక్రమంలో పాల్గొన్న వారిచే యోగసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న. అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్. తాసిల్దార్ శ్రీనివాసులు. తదితరులు ఉన్నారు.

## కూర్మ గ్రామంలో అగ్నిప్రమాదం దురదృష్టకరం: పవన్



అమరావతి, జూన్ 14: శ్రీకాకుళం జిల్లా కూర్మ గ్రామంలో అగ్నిప్రమాద ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ స్పందించారు. ఆధునిక హంగులు లేకుండా ఆధ్యాత్మిక చింతనతో జీవించేలా తీర్చిదిద్దుకున్న కూర్మ గ్రామం అగ్నికి ఆహుతి కావడం దురదృష్టకరమన్నారు. అగ్నిప్రమాదంపై పోలీసులు లోతుగా విచారణ చేయాలని సంబంధిత యంత్రాంగానికి సూచనలు చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై అనుమానాలు వ్యక్తమవుతున్న తరుణంలో ఆ కోణంలోనూ దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. కూర్మ గ్రామంలో ప్రస్తుత పరిస్థితిపై జిల్లా అధికారులతో మాట్లాడి, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు.సనాతన ధార్మిక జీవనం కోసం ఇస్కాన్ ఆధ్వర్యంలో ఈ గ్రామం ఏర్పాటైందని తెలిపారు. కూర్మ గ్రామవాసులు యాంత్రిక జీవన విధానాలకు భిన్నంగా మట్టి ఇళ్లల్లో ఉంటూ ప్రకృతి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారన్నారు. వేద విద్యను అభ్యసించే చిన్నారులు సంస్కృతం, తెలుగు, హిందీ, ఆంగ్లం అనర్గళంగా మాట్లాడుతూ ఉంటారని అన్నారు. వర్తమాన కాలంలో విశిష్టంగా ఉన్న ఈ గ్రామం పునరుద్ధరణపై దృష్టి సారించాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.ఇటీవల కూర్మ గ్రామంలోని ఆధ్యాత్మిక ప్రసంగాలు చేసే రాధాకృష్ణ మందిరంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో భక్తులు భయంతో పరుగులు తీశారు. ఈ ఘటనలో విలువైన గ్రంథాలు, పుస్తకాలు అగ్నికి ఆహుతయ్యాయి. దాదాపు రూ.50 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లినట్లు అంచనా. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీం రంగంలోకి దిగి పలు ఆధారాలను సేకరించాయి. గతంలోనూ దుండుగులు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడ్డారని నిర్వాహకులు తెలిపారు.

# సంపాదకీయం

ఆదివారం 15-06-2025

## భారత్ రుద్రాస్త్ర, భార్గవాస్త్ర...

భారత సాయుధ దళాలు ఆధునిక యుద్ధ సాంకేతికతలో గణనీయమైన పురోగతి సాధిస్తున్నాయి. ఇప్పటికే దేశీయంగా అనేక ఆయుధాలు రూపొందించుకోవడంతోపాటు కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటోంది. ఇదే సమయంలో విదేశాల నుంచి కూడా అవసరమైన ఆయుధాలు కొనుగోలు చేస్తోంది. ఈ క్రమంలో నాగ్‌పూర్‌కు చెందిన సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్ (ాఆంఒ) రూపొందించిన 'రుద్రాస్త్ర' అనే హైబ్రిడ్ వర్టికల్ టేకాఫ్ అండ్ ల్యాండింగ్ మానవ రహిత విమానం (యూఏవీ)2025, జూన్ 11న రాజస్థాన్‌లోని పోఖ్రాన్ ఫైరింగ్ రేంజ్‌లో విజయవంతంగా పరీక్షించబడింది. దీనిని నిఘా, రక్షణ, గుర్తింపు, కచ్చితమైన దాడుల కోసం రూపొందించారు. ఇది భారత సైన్యానికి బహుముఖ సామర్థ్యాలను అందిస్తుంది. తాజా పరీక్ష భారత రక్షణ రంగంలో స్వదేశీ సాంకేతికత అభివృద్ధి, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి ఒక మైలురాయిగా నిలుస్తుంది. రుద్రాస్త్ర యూఏవీ 50 కిలోమీటర్ల మిషన్ పరిధిలో అద్భుతమైన పనితీరును ప్రదర్శించింది, రియల్?టైమ్ వీడియో ఫీడ్‌ను స్థిరంగా అందించడంతోపాటు, సురక్షితంగా లాంచింగ్ పాయింట్‌కు తిరిగి వచ్చింది. లక్ష్యంపై చక్కర్లు కొట్టే సామర్థ్యంతో దీని మొత్తం పరిధి 170 కిలోమీటర్లకు చేరుకుంటుంది. ఇది 1.5 గంటల పాటు నిరంతరాయంగా గగనతలంలో ప్రయాణించగలదు. పరీక్ష సమయంలో, ఈ యూఏవీ యాంటీ?పర్సనల్ వార్‌హెడ్‌ను అత్యంత కచ్చితత్వంతో లక్ష్యంపై ప్రయోగించి, భూమికి సమీపంలో ఉన్నప్పుడు పేల్చడంలో విజయవంతమైంది. ఈ పరీక్ష భారత సైన్యం నిర్దేశించిన కఠిన ప్రమాణాలను అందుకుంది, ఈ రుద్రాస్త్ర బహుముఖ సామర్థ్యాలను నిరూపించింది. భారత్ డ్రోన్ యుద్ధ సాంకేతికతలో వేగంగా ముందుకు సాగుతోంది. రుద్రాస్త్రతోపాటు, సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్ మరో కీలకమైన ఆయుధం, 'భార్గవాస్త్ర' అనే యాంటీ?డ్రోన్ వ్యవస్థను 2025 మే 13న ఒడిశాలోని సీవార్డ్ ఫైరింగ్ రేంజ్‌లో విజయవంతంగా పరీక్షించింది. ఈ వ్యవస్థ డ్రోన్ సమూహాలను నిష్క్రియం చేయడానికి మైక్రో?రాకెట్లను ఉపయోగిస్తుంది, ఇది ఆధునిక యుద్ధంలో డ్రోన్ బెదిరింపులను ఎదుర్కోవడానికి కీలకమైన సాధనంగా నిలుస్తుంది. డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ రుస్తుం సిరీస్ డ్రోన్లను అభివృద్ధి చేస్తోంది, ఇవి మధ్యస్థ ఎత్తులో ఎక్కువ సమయం ప్రయాణించే సామర్థ్యంతో రూపొందించబడ్డాయి. ఇవి నిఘా, యుద్ధం సామగ్రి సరఫరా కోసం ఉపయోగపడతాయి. అదానీ డిఫెన్స్, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ వంటి ప్రముఖ సంస్థలు కూడా అధునాతన డ్రోన్ తయారీలో పాల్గొంటున్నాయి. ఇవి సరిహద్దు రక్షణ, యుద్ధ వ్యూహాలను మెరుగుపరుస్తున్నాయి. 2025 మేలో జరిగిన ఆపరేషన్ సిందూర్‌లో, ఇజ్రాయెల్ సాంకేతికత సహాయంతో బెంగళూరులోని ఆల్ఫా డిజైన్ టెక్నాలజీస్ రూపొందించిన స్కైస్ట్రైకర్ కామికేజ్ (ఆత్మాహుతి) డ్రోన్లను భారత సైన్యం విజయవంతంగా ఉపయోగించింది. ఈ డ్రోన్లు పాకిస్థాన్ రాడార్లు, కాన్వాయ్‌లు, ఇతర కీలక స్థావరాలను నాశనం చేశాయి. ఇది భారత్ డ్రోన్ యుద్ధ సామర్థ్యాలను అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా చేసింది. రుద్రాస్త్ర యూఏవీ, భార్గవాస్త్ర వంటి స్వదేశీ వ్యవస్థలు భారత రక్షణ రంగంలో సాంకేతిక స్వావలంబన దిశగా దూసుకెళ్తున్నాయి. ఈ వ్యవస్థలు ఆధునిక యుద్ధంలో కీలకమైన డ్రోన్ బెదిరింపులను ఎదుర్కోవడంతోపాటు, నిఘా, కచ్చితమైన దాడులు, సరిహద్దు రక్షణలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్నాయి. ఆఖీఆూ, ాఆంఒ ఇతర సంస్థలు సమన్వయంతో పనిచేస్తూ, భారత సైన్యాన్ని అత్యాధునిక యుద్ధ సామర్థ్యాలతో బలోపేతం చేస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్‌లో స్కైస్ట్రైకర్ డ్రోన్ల వినియోగం భారత్?ఇజ్రాయెల్ సాంకేతిక సహకారం ఫలితాలను ప్రదర్శించింది. ఈ విజయాలు భారత్‌ను డ్రోన్ యుద్ధ సాంకేతికతలో ప్రపంచ నాయకుడిగా నిలపడానికి దోహదపడతాయి. అయితే, ఈ సాంకేతికతలను మరింత సమర్థవంతంగా, స్థిరమైన ఉత్పత్తి, శిక్షణతో అమలు చేయడం భవిష్యత్తులో కీలకం. రుద్రాస్త్ర, భార్గవాస్త్ర, స్కైస్ట్రైకర్ వంటి డ్రోన్ వ్యవస్థలు భారత రక్షణ రంగంలో స్వదేశీ సాంకేతికత, అంతర్జాతీయ సహకార సమ్మేళనాన్ని సూచిస్తున్నాయి. ఈ పురోగతులు భారత సాయుధ దళాలను ఆధునిక యుద్ధ సవాళ్లను ఎదుర్కొనేందుకు సన్నద్ధం చేస్తూ, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాకారం చేస్తున్నాయి.

# నా తండ్రికి ప్రయాణంలోనే ప్రమాదం

### రామ్మోహన నాయుడు ఆవేదన

న్యూఢిల్లీ, జూన్ 14, ( )"నా తండ్రి కూడా ప్రమాదంలోనే మరణించారు. అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాద ప్రభావ కుటుంబాల బాధ నాకు తెలుసు.. నేను అర్థం చేసుకోగలను" అని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాద ఘటనను పౌర విమానయాన శాఖ అత్యంత తీవ్రంగా పరిగణిస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఈ దుర్ఘటనపై శనివారం ఆయన ఢిల్లీలో ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ప్రమాదం జరిగిన వెంటనే సహాయక చర్యలు ముమ్మరంగా చేపట్టామని, గుజరాత్ ప్రభుత్వం, పౌర విమానయాన శాఖ సమన్వయంతో పనిచేశాయని తెలిపారు. "ఘటన జరిగిన వెంటనే మంటలను అదుపులోకి తెచ్చి, మృతదేహాలను తరలించాం. ఈ దుర్ఘటనపై తక్షణమే దర్యాప్తునకు ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశాం. అవసరమైతే ఈ కమిటీలో మరికొంత మంది సభ్యులను కూడా చేర్చుతాం" అని వివరించారు. శుక్రవారం సాయంత్రం ఘటనా స్థలంలో విమాన బ్లాక్‌బాక్స్ లభ్యమైందని, దానిని విశ్లేషించిన తర్వాత ప్రమాదానికి గల కారణాలపై పూర్తి స్పష్టత వస్తుందని ఆయన తెలిపారు. "బ్లాక్ బాక్స్‌లో ఏముందో తెలుసుకోవడానికి ఎదురుచూస్తున్నాం" అని పేర్కొన్నారు. దర్యాప్తు ప్రక్రియ గురించి వివరిస్తూ, "హోంశాఖ సెక్రెటరీ ఆధ్వర్యంలో మరో ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేశాం. ఇందులో వివిధ రంగాలకు చెందిన నిపుణులు, ప్రత్యేక అధికారులు సభ్యులుగా ఉంటారు. సంపూర్ణ దర్యాప్తు జరిపేందుకు ఈ కమిటీ దోహదపడుతుంది. నిపుణుల విచారణ పూర్తయిన తర్వాత, తగిన సమయంలో మీడియాకు అన్ని వివరాలు వెల్లడిస్తాం. రెండు నెలల్లోగా విచారణ పూర్తవుతుందని ఆశిస్తున్నాం. అంతేకాకుండా, బోయింగ్ 787 సిరీస్ విమానాలను తరచూ తనిఖీలు చేయాలని ఆదేశాలు జారీ చేశాం" అని రామ్మోహన్ నాయుడు తెలిపారు. అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమానం కుప్పకూలిన ఘటనలో మరో మృతదేహం లభ్యమైంది. ప్రమాదానికి గల కారణాలను అన్వేషించేందుకు శనివారం ఉదయం శిథిలాలను తొలగిస్తుండగా విమానం తోక భాగంలో ఈ మృతదేహాన్ని గుర్తించారు. అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే విమానాశ్రయానికి సమీపంలోని వైద్యులు, నర్సింగ్ సిబ్బంది నివాస సముదాయంపై కుప్పకూలిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనలో విమానం చాలా వరకు మంటల్లో కాలిపోగా, తోక భాగం మాత్రం ఒక భవనంపై ఇరుక్కుపోయింది. తోక భాగాన్ని తొలగిస్తుండగా లభ్యమైన మృతదేహం విమాన సిబ్బందిలోని ఎయిర్‌హోస్టెస్‌దిగా అధికారులు ధృవీకరించారు. ప్రమాదానికి ముందు విమానం సీనియర్ పైలట్ కెప్టెన్ సుమిత్ సభర్వాల్ చివరి ఐదు సెకన్ల ఆడియో సందేశం ఒకటి వెలుగులోకి వచ్చింది. అందులో ఆయన "మేడే.. మేడే.. మేడే.. నో పవర్.. నో థ్రస్ట్.. గోయింగ్ డౌన్" (అపాయం.. అపాయం.. అపాయం.. శక్తి లేదు.. ఒత్తిడి లేదు.. కిందకు పడిపోతున్నాం) అని అత్యంత ఆందోళనకరంగా చెప్పినట్లు రికార్డయింది. ఈ సందేశం అందిన వెంటనే విమానం కూలిపోయినట్లు తెలుస్తోంది. అహ్మదాబాద్ లో సంభవించిన ఘోర విమాన ప్రమాదం నేపథ్యంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడిపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎంతో క్లిష్టమైన పౌర విమానయాన శాఖను నిర్వహించేందుకు రామ్మోహన్ నాయుడు సమర్థుడు కాదని, ఆయనకు తగినంత అనుభవం లేదని పాల్ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆయన ఒక సూచన చేశారు. పౌర విమానయాన శాఖ ఎంతో క్లిష్టమైనదని, దానిని నిర్వ హించడానికి అపార మైన నైపుణ్యం, పరిణతి, అనుభవం అవసరమని కేఏ పాల్ అన్నారు. 37 ఏళ్ల రామ్మోహన్ నాయుడు ఉత్సాహవంతుడు, చిత్తశుద్ధి కలిగిన వ్యక్తి అయినప్పటికీ, ఈ కీలక శాఖను నడిపించడానికి అవసరమైన సామర్థ్యం ఆయనకు ఇంకా రాలేదని పాల్ పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇంతటి సున్నితమైన, సాంకేతికంగా అత్యంత కీలకమైన శాఖ బాధ్యతల నుంచి రామ్మోహన్ నాయుడిని తప్పించాలని ఆయన అనేక సవాళ్లతో కూడుకున్నదని, దానికి తగిన అనుభవజ్ఞులను మంత్రిగా నియమించాల్సిన అవసరం ఉందని పాల్ పరోక్షంగా తెలిపారు.

# 16న ఇంటర్ రిజల్ట్స్

హైదరాబాద్, జూన్ 14 (న్యూస్ పల్స్)లంగాణలో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 29వ తేదీతో ముగిసిన సంగతి తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా ఈ సారి ఏకంగా 4.2 లక్షల మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యారు. ఇంత పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరుకావడంతో ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఇంటర్ పరీక్షల్లో తప్పిన కొందరు విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరైతే.. మరికొందరేమో మార్కులను పెంచుకునేందుకు ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలు రాశారు. దీంతో ఇంటర్ సప్లిమెంటరీలో విద్యార్థుల సంఖ్య భారీగా పెరిగింది. ఇప్పటికే ఈ పరీక్షల మూల్యాంకనం ప్రక్రియ కూడా ముగిసింది. ఇక ఫలితాలు కూడా త్వరలోనే వెల్లడికానున్నాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు పరీక్షల ఫలితాలకు సంబంధించి ప్రకటన జారీ చేసింది. ఇంటర్ బోర్డు తాజా ప్రకటన మేరకు జూన్ 16న సప్లిమెంటరీ ఫలితాలు విడుదల కానున్నాయి. సోమవారం (జూన్ 16) మధ్యాహ్నం ఫలితాలను విడుదల చేయాలని నిర్ణయించినట్టు ఇంటర్‌బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు వెల్లడైన తర్వాత అధికారిక వెబ్‌సైట్‌తో పాటు టీవీ9 తెలుగు వెబ్‌సైట్‌లోనూ చెక్ చేసుకోవచ్చు. కాగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 22 నుంచి మే 29 వరకు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ సారి రాష్ట్ర వ్యాప్తంగా ఏకంగా 4.2లక్షల విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా వీరికోసం రాష్ట్రవ్యాప్తంగా 892 పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేశారు. ఫస్టియర్ విద్యార్థులకు పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, సెకండియర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 వరకు పరీక్షలు నిర్వహించారు. మే 29 నుంచి మొదటి విడత మూల్యాంకనం, మే 31 నుంచి రెండో విడత మూల్యాంకనం.. చేపట్టారు. జోసా కౌన్సెలింగ్, ఈఏపీసెట్, నీట్ వంటి ప్రవేశాలకు ఇంటర్ మార్కులు కీలకం కానుండటంతో విద్యార్థులు ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. ఫలితాలు చూసిన తర్వాత మార్క్‌షీట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం మర్చిపోవద్దు. ఒరిజినల్ మార్క్ షీట్ వచ్చే వరకు ఇదే మీకు అన్నింటికీ యూజ్ అవుతుంది. డిగ్రీలో చేరాలన్నా, లేదా ఏదైనా ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవాలన్నా ఇదే ముఖ్యం. అందుకే మార్క్ షీట్‌ను డౌన్‌లోడ్ చేసి పెట్టుకొని ఒకట్రెండు ప్రింట్‌లు కూడా తీసి పెట్టుకోండి. గత ఏప్రిల్‌లో రెగ్యులర్‌గా ఇంటర్ ఫలితాలను అధికారులు విడుదల చేశారు. అందులో ఉత్తీర్ణత సాధించలేకపోయిన వాళ్లకు మళ్లీ ఫీజు తీసుకొని మే 22 నుంచి 30 వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం ఐదున్నర వరకు రెండు షిఫ్టుల్లో చేపట్టారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు మొదటి షిఫ్టులో, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు ఈ పరీక్షలు చేపట్టారు. సప్లిమెంటరీలో కూడా ఉత్తీర్ణత సాధించలేకపోతే ఏం చేయాలి సప్లిమెంటరీ ఫలితాల్లో కూడా ఉత్తీర్ణత సాధించలేని వాళ్లు మరో ఏడాది ఎదురు చూడక తప్పదు. బాగా రాశాం అనే నమ్మకం ఉన్న వాళ్లు ఫీజు చెల్లించి రీవాల్యుయేషన్‌కు లేదా రీ కౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. రీవాల్యుయేషన్‌కు ఆరు వందల రూపాయలు, రీ కౌటింగ్‌కు వందల రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. జూన్ 20 నుంచి జూన్ 25వరకు ఇలా దరఖాస్తు చేసుకోవచ్చు. బిబఎతివ.ఇణణ.ణనీల.తిని వెబ్‌సైట్‌లో నేరుగా దరఖాస్తు చేయవచ్చు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు తెలంగాణ ప్రభుత్వం సరికొత్త వేదకను ఏర్పాటు చేసింది. టీఎస్ ఎడ్యుకేషన్ హబ్ పేరుతో కొత్త డిజిటల్ ప్లాట్‌ఫామ్ తీసుకొచ్చింది. ఇక్కడ రిజల్ట్స్, సిలబస్, మోడల్ పేపర్లు ఇలా చాలా అంశాలు అప్‌లోడ్ చేస్తున్నారు. అంటే ఓ విధంగా ఆన్‌లైన్ లెర్నింగ్‌కు ఎంతగానో ఉపయోగపడనుంది. దీన్ని రేపటి నుంచి అందుబాటులోకి తీసుకురానున్నారు.

# రాజస్థాన్ లో 498 ఏ టీకేఫ్

జైపూర్, జూన్ 14 (న్యూస్ పల్స్)భార్య తనపై పెట్టిన కేసులకు నిరసనగా అత్తారింటి ముందు టీకొట్టు పెట్టి చేతులకు బేడీలు వేసుకొని ఓ భర్త టీ అమ్ముతున్న ఘటన రాజస్థాన్‌లోని అంటా జిల్లాలో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. రాజస్థాన్‌కు చెందిన కృష్ణ కుమార్ ధాకడ్ అనే వ్యక్తికి మీనాక్షి మాలవ్ అనే యువతితో 2018లో వివాహం జరిగింది. పెళ్లైన కొన్ని రోజులకు ఈ దంపతులు తేనెటీగల పెంపకం వ్యాపారాన్ని స్టార్ట్ చేశారు. ఈ వ్యాపారంతో వీరు చుట్టుపక్కన ఉన్న మహిళలకు కూడా ఉపాధి కల్పించారు. దీంతో వీరికి మంచి గుర్తింపు వచ్చింది. అయితే కొన్ని రోజుల తర్వాత తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వారి పుట్టింటికి వెళ్లిపోయిందని కృష్ణ కుమార్ తెలిపారు. అయితే ఇంటి నుంచి వెళ్లిపోయిన భార్య కొన్ని నెలల తర్వాత తన తీవ్ర ఆరోపణలు చేస్తూ వరకట్న వేధింపుల సెక్షన్ 498ఏ, సెక్షన్ 125 కింద కేసులు పెట్టిందని కృష్ణ కుమార్ తెలిపాడు. ఒక తప్పుడు కేసు వల్ల తన జీవితమంతా నాశనమైందని.. మూడేళ్లుగా తాను న్యాయం కోసం కోర్టుల చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగట్లేదని భావోద్వేగానికి గురయ్యాడు. ఇక తనకు అన్యాయం చేసిన భార్యకు తగిన గుణపాఠం చెప్పాలని నిర్ణయించుకున్నాడు. భార్య తనపై పెట్టిన కేసుకు నిరసనగా అత్తారింటి ముందు ఓ టీ కొట్టును ప్రారంభించాడు. అయితే, ఆ టీకొట్టుకు కృష్ణకుమార్ వినూత్నమైన పేరు పెట్టాడు. అదే భార్య తనపై పెట్టిన వరకట్న వేధింపుల సెక్షన్ 498 ం కేఫ్ పేరుతో టీకొట్టును ప్రారంభించాడు. భార్య పెట్టిన కేసులో మూడేళ్ల పాటు తాను అనుభవించిన బాధను తెలియజేసేలా చేతులకు బేడీలు వేసుకొని టీ అమ్మడం స్టార్ట్ చేశాడు. అంతే కాకుండా టీ షాప్‌లో కొన్న బ్యానర్స్ కూడా ఏర్పాటు చేశాడు. తనకు న్యాయం జరిగే వరకు ఈ టీ మరుగుతూనే ఉంటుందని, 125 కింద ఎంత ఖర్చు ఇవ్వాల్సి వస్తుందో చాయ్ తాగుతూ చర్చించుకుందా రండి అంటూ ఉన్న నినాదాలతో కొన్ని బ్యానర్లు, పోస్టర్లు ఏర్పాటు చేశాడు. చట్టాన్ని దుర్వినియోగం చేసి తనను తప్పుడు కేసులో ఇరికించిన ప్రాంతంలో టీ అమ్ముతూ నిష్పక్షపాతంగా ఈ న్యాయపోరాటం చేయాలని తాను నిర్ణయించుకున్నట్టు కృష్ణ కుమార్ తెలిపాడు. ఇదిలా ఉండగా ఆయన భార్య మాత్రం అతనిపై తీవ్ర ఆరోపణలు చేసింది. తన భర్త భూమి కొనుగోలు చేసేందుకు తన తండ్రిని డబ్బు అడిగాడని.. దానికి తన తండ్రి నిరాకరించడంతో తనను వేధింపులకు గురిచేశాడని ఆమె ఆరోపించింది. అందుకే తాను తన పెట్టింటికి వెళ్లిపోయినట్టు చెప్పుకొచ్చింది. తాను కృష్ణకుమార్ నుంచి విడాకులు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నానని.. కానీ దానికి ముందు భర్త తన తండ్రి నుంచి ఇదువరకు తీసుకున్న అప్పులన్నీ తిరిగి ఇవ్వాలని ఆమె తెలిపింది. మరోవైపు భార్య పెట్టిన సెక్షన్ల పేరుతో కృష్ణకుమార్ ప్రారంభించిన '498ఏ టీ కేఫ్' ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఇతని కథ విన్న నెటిజన్లు తమదైన రీతిలో కామెంట్స్ చేస్తున్నారు.

# ఇంతకీ డంపింగ్‌యార్డు రద్దు అయ్యేదెన్నడో..

## 130వ రోజుకు నిరాహారదీక్షలు




గుమ్మడిదల, జూన్ 14 : ప్యారానగర్ డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా రిలే నిరాహారదీక్షలు చేస్తున్న రైతు జేఏసీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు. శనివారానికి 130వ రోజుకు చేరుకున్న రిలే నిరాహార దీక్షల్లో రైతు జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. నల్లవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్యారానగర్ గ్రామశివారులో ఏర్పాటు కాబోతున్న డంపింగ్‌యార్డు (ఎంఎస్‌డబ్ల్యూ)ను రద్దు చేసేదెప్పుడో అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు నెలలకుపైగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి మనస్సు కరుగడం లేదని వాపోతున్నారు. ఇలాంటి మొండి వైఖరి ఉన్న రాష్ట్ర పాలకవర్గాన్ని ఎప్పుడు చూడలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతుల గోడు పట్టించుకోని సర్కారుకు భవిష్యత్‌లో మంచి గుణపాఠం మిగులుతుందని హెచ్చరించారు. ఇకనైనా సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు మొండివైఖరిని విరమించుకుని అనుమతిచ్చిన డంపింగ్‌యార్డును రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# రాజీపడితే ఇరువర్గాలు గెలిచినట్టే : జడ్జి కీర్తిచంద్రిక రెడ్డి

ఇల్లెందు, జూన్ 14 : కక్షిదారులు క్షణికావేశంలో పెట్టుకున్న పోలీస్ కేసులు రాజీపడదగిన, మనోవర్తి , గృహ హింస, చెక్ బౌన్స్, ప్రామిసరీ నోటు కేసుల్లో ఇరువర్గాలు కోర్టుకు వచ్చి రాజీ కుదుర్చుకున్నట్లైతే ఇరు వర్గాలు గెలిచినట్లే అవుతుందని ఇల్లందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తిచంద్రిక రెడ్డి అన్నారు. శనివారం ఉదయం స్థానిక ఇల్లందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఇల్లందు మండల న్యాయ సేవ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజీపడదగిన కేసుల్లో కక్షిదారులు రాజీపడితే ఎంతో విలువైన కాలాన్ని, డబ్బును ఆదా చేసుకోవచ్చన్నారు. కక్షిదారులు పంతాలకు పోకుండా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఇల్లందు



బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జడ్జి చేతుల మీదుగా కక్షిదారులకు మొక్కలు పంపిణీ చేశారు. విధిగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కీర్తి కార్తీక్, సీనియర్ న్యాయవాదులు పెద్దూరి వెంకట నరసయ్య, పప్పుల గోపీనాథ్, దంతాల ఆనంద్, ఎస్.వెంకటేశ్వర్లు, జూనియర్ న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

# డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు కృషి చేస్తా : కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్

పటాన్ చెరు, జూన్ 14: వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానని పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ తెలిపారు. శనివారం పటాన్ చెరు డివిజన్ పరిధిలో ఉన్న అంబేద్కర్ కాలనీలో పర్యటించి డ్రైనేజీ సమస్యను తెలుసుకున్నారు. కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో పలు చోట్ల నాలా జామ్ కావడం జరుగుతుందని ఈ సందర్భంగా కాలనీవాసులు తెలిపారు. నాలాలో చెత్త పెరిగిపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుందని దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు జీహెచ్ఎంసి అధికారులతో మాట్లాడి సమీక్ష చేస్తానన్నారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

## తల్లికి వందనం పథకం ప్రారంభం చిన్నారుల తల్లిదండ్రులకు ఆనందం....



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- జూలై 14 ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల మేనిఫెస్టో లో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం పథకం కింద తల్లులకు ఖాతాలో నగదు జమ చేసిన సందర్భంగా శనివారం డోన్ పట్టణంలో ఎమ్మెస్సార్ ఆఫీస్ నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి టిడిపి నాయకులు, కార్యకర్తలు చిన్నారులతో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు "చిత్రపటాని" కి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చిన్నారుల చదువు కోసం కూటమి ప్రభుత్వం"తల్లికి వందనం" పథకం కింద తల్లుల ఖాతాలో కూటమి ప్రభుత్వం నగదు జమ చేయడం జరిగిందని, లబ్దిదారుల ఆనందానికి అవధుల్లేవన్ని తల్లిదండ్రులు తమ సంతోషాన్ని వ్యక్తం చేయడం మనమందరం చూస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా నారా చంద్రబాబు నాయుడు కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డోన్ పట్టణ టిడిపి అధ్యక్షులు చాటకొండ శ్రీనివాసులు, ప్యాపిలి మండలం టిడిపి అధ్యక్షులు గండికోట రామసుబ్బయ్య, బేతంచేర్ల పట్టణ బిసి సెల్ నాయకులు లోకేష్ గౌడ్, డోన్ మండలం టిడిపి తెలుగుయువత అధ్యక్షులు కోనేటి కాశీ విశ్వనాథ్ మరియు టిడిపి నాయకులు, కార్యకర్తలు చిన్నారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్కూల్, కాలేజీల టైమ్స్ కి అనుగుణంగా బస్సులు నడపాలి... బిఎస్ఎఫ్



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- జూన్ 14 విద్యార్థుల స్కూల్ మరియు కాలేజీల సమయానుకూలంగా విద్యార్థి బస్సులు నడపాలని బహుజన స్టూడెంట్ ఫెరడేషన్ రాష్ట్ర అధ్యక్షులు విజయభాస్కర్ శనివారం డోన్ ఆర్టీసీ మేనేజర్ శశి భూషణ్ కి వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డోన్ డిపో నుండి నియోజవర్గంలో ప్రతి గ్రామంలో విద్యార్థులకు స్కూల్ మరియు కాలేజీ విద్యార్థుల సమయాలకు ఆర్టీసీ విద్యార్థి బస్సు నడపాలని ఈ సందర్భంగా వారు కోరారు అదేవిధంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులు కొంతమందికి హాస్టల్ లో సీట్లు దొరకక వివిధ రకాలుగా ఇబ్బందులు పడుతూ వారి యొక్క స్కూలు మరియు కాలేజీ హాజరు శాతం తక్కువ కావడం వలన ఎగ్జామ్స్ టైం లో హాల్ టికెట్ల ఇబ్బందులకు గురవుతున్నారు కాబట్టి విద్యా సంవత్సరం నుండి ప్రతి గ్రామ గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించడం వలన ఆ యొక్క చదువులకు సస్యశ్యామలంగా ముందుకు సాగడానికి ఆర్టిసి బస్సు తోడ్పడుతుంది కాబట్టి ఖచ్చితంగా డోన్ మోడల్ స్కూల్ వివిధ గ్రామాలకు వారి సమయాలుకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులు తప్పనిసరిగా నడపాలని వారి సందర్భంగా కోరారు ఈ కార్యక్రమంలో బహుజన్ నాయకులు కొచెర్వు కాంత్ సుదర్శన్ వెంకటేష్ రవికుమార్ ప్రసాద్ జై రామ్ వెంకటేసులు పాల్గొన్నారు

## అంతర్ జిల్లా దొంగల అరెస్ట్

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 14-నంద్యాల జిల్లాలో అంతర్ జిల్లా దొంగలు వేముల శివశంకర్, కొండా పవన్ కుమార్లను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.39 లక్షల విలువైన 39 తులాల బంగారు, 32 తులాల వెండి నగలు, ఒక ల్యాప్టాప్ స్వాధీనం చేసుకున్నారు. శివశంకర్ పై 21, పవన్ కుమార్ పై 36 చోరీ కేసులు ఉన్నాయని, వీరిని నల్గొండ, గుంటూరు జిల్లాలకు చెందిన వారిగా గుర్తించినట్లు ఏఎస్పీ యుగంధర్ బాబు వెల్లడించారు. నిందితుల అరెస్ట్ లో కీలక పాత్ర పోషించిన పోలీసు అధికారులను మరియు సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.




# రాష్ట్రస్థాయి అంధుల చెస్ పోటీలు ప్రారంభం

### అంధుల చెస్ పోటీలు నంద్యాలలో మొదటిసారి: డాక్టర్ రవి కృష్ణ




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 14-లూయీ బ్రెయిలీ అంధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జీవనజ్యోతి అంధుల వసతి గృహం ప్రాంగణంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర స్థాయి అంధుల చెస్ పో టీలు శనివారం పోలూరు రోడ్డులో ఉన్న జీవనజ్యోతి అంధుల సంక్షేమ వసతి గృహంలో ప్రారంభించారు. ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ ఫర్ బ్లైండ్ అనుబంధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో రెండవ రాష్ట్రస్థాయి అంధుల చెస్ పోటీలు శని ఆది వారాలలో నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఎన్ఎండి ఫిరోజ్, రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలు లాంచనంగా ప్రారంభించారు.ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం దివ్యాంగుల పెన్షన్ 3000 నుండి 6000 వరకు చేసిందని గుర్తు చేశారు. క్రీడల్లో కూడా దివ్యాంగులను ప్రోత్సహించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నూతన క్రీడా పాలసీ లో దివ్యాంగ క్రీడలకు ప్రత్యేక ప్రణాళిక ప్రకటించారని తెలిపారు.డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ క్రీడా కోటాలో దివ్యాంగులకు అవకాశం కల్పించారని అన్నారు. పోటీలలో విద్యార్థులకు షీల్డు నగదు బహుమతులు డాక్టర్ రామకృష్ణారెడ్డి, భోజన వసతి క్రీడా దుస్తులు భవనాసి జ్యువెలర్స్ తరఫున భవనాసి నాగ మహేష్ సౌజన్యంతో అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్. సి . సి కల్నల్ ఫిలిప్, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు ఖలీల్, జీవనజ్యోతి పాఠశాల నిర్వాహకుడు వలి భాష,భవనాసి నాగ మహేష్, యాతం చంద్రమౌళీశ్వర రెడ్డి, జోజి రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

# రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవండి:జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా




కర్నూలు, జూన్ 14 రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానిక రెడ్ క్రాస్ సొసైటీ ఆవరణంలో వైద ఆరోగ్య శాఖ, రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ రక్త దాత దినోత్సవం నిర్వహించారు..ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో రక్తదానాన్ని ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం జూన్ 14 వ తేదీన ప్రపంచ రక్త దాత దినోత్సవంగా జరుపుకుంటామన్నారు. అన్ని దానాల కంటే ప్రాణాలను నిలిపే రక్తదానం చాలా గొప్పదన్నారు.. రక్తదానం చేసిన వ్యక్తులను జూన్14 వ తేదీన ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా సన్మానం చేసుకుంటామన్నారు. అదే విధంగా వారి సేవలకు కృతజ్ఞతలు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. రక్తదానం చేయడం ఆరోగ్యానికి కూడా ఎంతో మంచిదన్నారు...ప్రపంచ రక్తదాతల దినోత్సవం థీమ్ ప్రతి సంవత్సరం మారుతూ ఉంటుందని, తమకు తెలియని వ్యక్తుల కోసం తమ రక్తాన్ని దానం చేసే నిస్వార్థ వ్యక్తులకు గుర్తింపుగా, ఈ సంవత్సరం "రక్తం ఇవ్వండి, ఆశను ఇవ్వండి కలిసి మనం ప్రాణాలను కాపాడుకుందాం" అనే థీమ్ తో ప్రపంచ రక్తదాతల దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. దేశంలో ప్రతి సంవత్సరం 5 కోట్ల మందికి రక్తం అవసరం ఉందన్నారు. బ్లడ్ డొనేషన్ కేంద్రాల ద్వారా కేవలం 3.5 కోట్లు మాత్రమే డొనేట్ అవుతుందన్నారు.. ఇంకా 1.5 కోట్లు కొరత ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో 6.5 లక్షల మందికి రక్తం అవసరం ఉంటే కేవలం 4 లక్షలు మాత్రమే డొనేట్ అవుతుందన్నారు.. కర్నూలు జిల్లాలో 45 వేలు అవసరం ఉంటే 35 వేల మాత్రమే డొనేట్ అవుతుందన్నారు.. ఆ కొరత ఉండడంతో రక్తం అత్యవసరం ఉండే వారు రక్తం దొరకక మరణించే అవకాశం ఉంటుందన్నారు..రక్తదానం చేయడం ద్వారా మనిషి ప్రాణాలను కాపాడే అవకాశం ఉందని ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కలెక్టర్ కోరారు. ప్రజల్లో రక్తదానం మీద అవగాహన కల్పించి రక్తదానం చేసే విధంగా ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా పలువురు రక్తదానం చేశారు.. వారికి కృతజ్ఞతలు తెలుపుతూ వారికి కలెక్టర్ జిల్లా సర్టిఫికెట్ లు అందచేశారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డా.శాంతి కళ, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డా కేజీ గోవిందరెడ్డి, రెడ్ క్రాస్ సొసైటీ కర్నూల్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ ట్రెజరర్ రఘునాథ్ రెడ్డి,మాజీ చైర్మన్ శ్రీనివాసులు,కమిటీ మెంబర్లు,శ్రీమతి అరుణ, మధుసూదన, ప్రభాకర్ రెడ్డి,నరసింహ,భీమా శంకర్ రెడ్డి, ఎం జె.బాబురాజు,కె.వి సుబ్బారెడ్డి, మీనాక్షి,సెక్రటరీ వెంకట కృష్ణుడు,మెడికల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు..

# మదర్సాలపై కావాలని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు

### రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు సూరి మన్సూర్ అలీ ఖాన్



కర్నూలు, జూన్ 14 రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మదర్సాలు, మసీదుల అభివృద్ధికి కృషి చేస్తోందని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు సూరి మన్సూర్ అలీ ఖాన్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని రోజా వీధిలోని మదర్సా వద్ద రోజా మసీదు ప్రపోజ్డ్ కమిటీ సభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో రోజా వీధిలో ఉన్న మదర్సాను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. మదర్సా నిర్వహణ గురించి ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. తమ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒక్కొక్క వ్యవస్థను క్రమపద్ధతిలో గాడిలో పెడుతున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే రోజా వీధిలోని మదర్సా ద్వారా ఆదాయం పొందేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ విషయంపై ఇప్పటికే వక్ఫ్ బోర్డు అధికారులను సంప్రదించి వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. మదర్సా ద్వారా వచ్చే ఆదాయాన్ని రోజా మసీదు నిర్వహణకు ఉపయోగించాలన్న ఆలోచనలో ఉన్నామన్నారు. ఎందుకంటే ప్రతి నెలా రోజా మసీదు నిర్వహణకు రూ. 20 వేల నుండి రూ.25వేల దాకా ఖర్చవుతుందన్నారు. మసీదుకు వచ్చే ఆదాయం కంటే ఖర్చు అధికంగా ఉందని పేర్కొన్నారు. మదర్సాను ఇప్పుడు ప్రతి రోజూ ఒక గంటసేపు ట్యూషన్ చెప్పే సమయానికి మాత్రమే ఉపయోగించుకుంటున్నారని చెప్పారు. సమీప ప్రాంతంలోనే మరొక మదర్సా కూడా ఉన్నట్లు తెలిపారు. రెండు మదర్సాలు దగ్గరగా ఉండటం వల్ల ఈ మదర్సా ఎక్కువగా ఉపయోగపడటం లేదన్నారు. ఇక్కడకు వచ్చే 15 మంది విద్యార్థులు రోజా మసీదులో విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో దీని ద్వారా ఆదాయం వచ్చేలా చేసి.. వచ్చే డబ్బును రోజా మసీదు నిర్వహణకు ఉపయోగించుకుంటే ఎంతో మేలు జరుగుతుందన్నారు. అయితే కొందరు గిట్టని వ్యక్తులు దీనిపై విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర మంత్రి టి.జి భరత్ అనుచరులు మదర్సాలను కబ్జా చేస్తున్నారని తప్పుడు సందేశాలు ప్రజల్లోకి తీసుకెళుతున్నారన్నారు. మంత్రి టి.జి భరత్ మదర్సాలు, మసీదుల అభివృద్ధి కోసం పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. వక్ఫ్ బోర్డు భూములు కబ్జాకు గురవ్వకుండా ఆయన చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ తప్పుడు ప్రచారాలు ప్రజలు నమ్మొద్దని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు సూరి మన్సూర్ అలీ ఖాన్ ప్రజలను కోరారు.

## కలెక్టర్ ను మర్యాద పూర్వకంగా కలిసిన కమిషనర్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 14- నంద్యాల మున్సిపల్ కమిషనర్ గా బండి శేషన్న శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ శ్రీమతి జి రాజకుమారి గణియా ను శనివారం పట్టణంలో పద్మావతి నగర్ ఇండోర్ స్టేడియంలో వద్ద మర్యాదపూర్వకంగా కలిసి చెట్టు ను బహుకరించారు. కమిషనర్ వెంట మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు. మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

## టెక్కే మార్కెట్ యార్డులో 5 వేల మందితో మెగా యోగ:జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 14-యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా ఈనెల 16వ తేదీ నంద్యాల పట్టణంలోని టెక్కే మార్కెట్ యార్డులో 5 వేల మందితో మెగా యోగ కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16వ తేదీ సోమవారం నాడు పెద్ద ఎత్తున జరిగే యోగా కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ భాగస్వామ్యం కావాలని కలెక్టర్ సూచించారు. గ్రామ సచివాలయ సిబ్బంది మొదలు కొని జిల్లా స్థాయి అధికారుల వరకు అందరూ భాగస్వాములై యోగా అభ్యాసాలు అవలంబించాలన్నారు. యోగ నిర్వహణ నేపథ్యంలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఉదయం 10:30 గం.లకు ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఈ మార్పును గమనించి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరుకావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యం-ట్రాఫిక్ పై ప్రజలకు అవగాహన సమావేశాలు



కర్నూలు, జూన్ 14 ప్రతి శనివారం రోడ్డు భద్రత పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోలీసు అధికారులకు కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ లు ఆదేశాలు జారీ చేశారు. వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సంధర్బంగా శనివారం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయా పోలీసుస్టేషన్ పరిధులలో జిల్లా పోలీసు అధికారులు ప్రజలకు రోడ్డు భద్రత , ట్రాఫిక్ నిబంధనల పై సమావేశాలు నిర్వహించి, అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బైక్ లు నడిపే వారు ఖచ్చితంగా హెల్మెట్లు ధరించే విధంగా , ఓవర్ స్పీడ్ , ఓవర్ లోడ్ తో వాహనాలు వెళ్ళకుండా, డ్రంకెన్ డ్రైవ్ చేయరాదని తదితర రోడ్డు భద్రత ప్రాముఖ్యతల పై ప్రజలకు అవగాహన కల్పించారు.

## అల్లం గోపాలరావు మృతి

### కళారంగానికి.మరియు వామపక్షలకి తీరని లోటు

చింతలపూడి : జూన్ 14 అల్లం గోపాలరావు మృతి కళారంగానికి మరియు వామపక్షాలకి తీరని లోటు అని సిపిఐ సీనియర్ నాయకులు మామిళ్ళపల్లి వసంతరావు అన్నారు అల్లం గోపాలరావు గారి సంతాప సభ ఆఫీసులో టీవీఎస్ రాజు అధ్యక్షతన జరిగింది ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా వసంతరావు మాట్లాడుతూ గోపాలరావు యువజన సమాఖ్య లో పని చేశారని తర్వాత ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడిగా పని చేస్తూ 1983లో మక్కిన వారి గూడెంలో ప్రజానాట్యముండలి శిక్షణ శిబిరంలో తొలి పరిచయంగా ఏర్పడి గొప్ప కళాకారులు టీవీ కళాకారుడిగా చలనచిత్ర కళాకారుడుగా సినీ నటులు బ్రహ్మానందానికి పర్సనల్ సెక్రెటరీగా జీవితంలో ఒక స్థానానికి ఎదిగిన మిత్రుడు అల్లం గోపాలరావు ఈరోజు ఆకస్మికంగా మృతి చెందటం చాలా బాధాకరం ఆనాటి జ్ఞాపకాలు ఇంకా స్మృతి పథంలో మెదులుతున్నాయి .రేలారే రేలా అనే పాటతో ఆనాడు ఉర్రూతలూగించిన ప్రజా కళాకారుడు గోపాలరావు అన్నారు. ఈ సంతాప సభలో అరసం రాష్ట్ర కార్యదర్శి బి ఎన్ సాగర్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల గురవయ్య సిపిఐ మండల కార్యదర్శి తొర్లపాటి బాబు సహాయ కార్యదర్శి దొంత కృష్ణ మండల కమిటీ సభ్యులు పుల్లూరి సోమశేఖర్ ప్రజానాట్యమండలి కళాకారులు అలెగ్జాండర్ లాజరు ఎస్కే మస్తాన్ ఎస్ లెలిన్ బాబు కే ఏసు పాదం తదితరులు పాల్గొన్నారు

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190